క్లుప్తంగా

వెంకన్న ఆదాయం రూ.3.29 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేట నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,29,143 వచ్చినట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. హుండీలను బుధవారం లెక్కించగా 99 రోజులకు ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. దేవాదాయశాఖ తరఫున రవి కుమార్, అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, వేంకటేశ్వర సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

రద్దీగా ఆర్టీసీ కాంప్లెక్స్



నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో బుధవారం కిటకిటలాడింది. ఆదివారం సెలవు, సోమవారం వినాయక చవితి కావడంతో స్వగ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణాలకు ఒక్కసారిగా రావడంతో కాంప్లెక్స్ ఆవరణ రద్దీగా కనిపించింది.

పౌష్టికాహార కిట్లు పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న పీడీ శాంతిశ్రీ

లావేరు: అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. మండలంలోని తాళ్లవలస గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న సీబీ ఈవెంట్‌ను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పౌష్టికాహారం కిట్లను పీడీ పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, కేంద్రాలకు వచ్చే పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలన్నారు. ఐసీడీఎస్ రణస్థలం ప్రాజెక్టు పీఓ ఝాన్సీరాం, మహిళా పోలీస్ ఎస్.కామేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, బ్రేక్స్ కో ఆర్డినేటర్ తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం ప్రారంభం



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మొదలవలస చిరంజీవి

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామంలోని బీసీ బాలుర (అద్దె) వసతి గృహం సముదాయాన్ని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి బుధవారం ప్రారంభించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతి లక్ష్యంగా అద్దె భవనాలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యం ఏర్పరుచుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ వసతి గృహం భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి పైడి యతిరాజులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తారు గోపి, సీపాన వెంకటరావు, మొదలవలస కృష్ణ, పైడి వాసుదేవరావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం




ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు తెలిపారు. బుధవారం ఎస్ఎంపురంలో పాఠశాల ఆవరణలో చేపడుతున్న ప్లాంటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లోకేష్, ఏపీఓ శోభారాణి, పాఠశాల సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

- శ్రీకాకుళం నగర పరిధిలో 16 శిబిరాల ఏర్పాటు
- మంచాన పడిన రోగుల వివరాల సేకరణ
- ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



శ్రీకాకుళం:

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ఉద్దేశించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి నగరంలో 16 సురక్షా శిబిరాలను ఏర్పాటు చేసేందుకు శ్రీకాకుళం మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో ఆరుచోట్ల, విలీన పంచాయతీల్లో పది శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహిస్తుండగా ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు తెలుసుకుని నమోదు చేస్తున్నారు. పూర్తిగా మంచాన పడిన వారి వివరాలను సేకరించి వారి వ్యాధి వివరాలు, ఫోటోలను రాష్ట్ర స్థాయిలో నివేదిస్తున్నారు. ఈ నెల 29 వరకు సర్వే కొనసాగుతుంది. ఇందుకుగాను శ్రీకాకుళం నగర పరిధిలో 16 బృందాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది బృందాలు కమిషనర్ ఓబులేసు, మరో ఎనిమిది బృందాలు హెల్త్ అధికారి డాక్టర్ వెంకటరావు నేతృత్వంలో సర్వే చురుగ్గా జరిగేలా ఏర్పాట్లు చేశారు. సర్వేలో సేకరించిన వివరాల ప్రకారం రోగులకు వారికి దగ్గరగా ఉండే శిబిరాల వద్దకు ఈ నెల 30వ తేదీ నుంచి తరలిస్తారు. ఇందులో ఆరు రకాల పరీక్షలను నిర్వహించి రోగి పరిస్థితిని గుర్తిస్తారు. అవసరమైన వారికి అక్కడి అక్కడే మందులు ఇస్తారు. శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్యం అవసరం అనుకుంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ గుర్తింపు ఆస్పత్రులకు తరలిస్తారు.

చురుగ్గా సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సర్వే చురుగ్గా జరుగుతోంది. నగరంలో ఉన్న ఆరు అర్బన్ హెల్త్ కేంద్రాలతో పాటు, విలీన పంచాయతీల పరిధిలో ఉన్న పది ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 30 నుంచి శిబిరాలు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– చల్లా ఓబులేసు, నగర కమిషనర్, శ్రీకాకుళం

రాష్ట్రస్థాయి పోటీలకు పైడిభీమవరం విద్యార్థి



రాష్ట్ర స్థాయికి ఎంపికైన ధనుంజయ్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం శోభారాణి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మండల స్థాయి పోటీల్లో 16 జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పైడిభీమవరం హైస్కూల్లో కబడ్డీ, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయని వ్యాయామ ఉపాధ్యాయులు జె.సుదర్శన్ బుధవారం తెలిపారు. లంకపేట హైస్కూల్లో వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్, యోగాసనాలు పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో గెలిపొందిన క్రీడాకారులు.. ఈ నెల 21, 22, 23 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పైడిభీమవరం పాఠశాలకు చెందిన డి.ధనుంజయ్ జిల్లా స్థాయిలో ఇటీవల జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. విద్యార్థిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సత్కరించింది. పైడిభీమవరం పాఠశాల క్రీడాకారులు ఆల్ రౌండర్ ప్రతిభ కనబర్చి నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు పీడీ సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎ.త్రినాథరావు, హెచ్‌ఎం టి.శోభారాణి పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితా సవరణ

- ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి



మాట్లాడుతున్న ఆర్డీవో శాంతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరగాలని.. తేడాలుంటే సహించేది లేదని రెవెన్యూ డివిజనల్ అధికారి, ఈఆర్‌వో బొడ్డేపల్లి శాంతి అన్నారు. శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ఓటర్ల జాబితాలో తేడాల సవరణకు సంబంధించి కొత్తగా చేర్చిన ఓటర్లు, తొలగించిన ఓటర్లు, కరక్షన్ చేసుకున్న ఓటర్ల వివరాలు తెలియాలన్నారు. మార్పులు, చేర్పులు గురించి తెలియజేశారు. సమావేశంలో అన్ని పార్టీల ప్రతినిధులకు చేర్పులు.. మార్పులకు సంబంధించిన ఫారం 9, 10, 11లో పోలింగ్ స్టేషన్ లొకేషన్, పేరు మార్పులకు సంబంధించి ఫారం 1, 2 అందజేశారు. సమావేశంలో శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావు, మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీ రమణమూర్తి, శ్రీకాకుళం, గార మండలాల సూపరింటెండెంట్లు, ఎలక్షన్ డీటీలు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు రావడ పురుషోత్తం, మాధవరావు, పీస గోపి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రావాడ సురేష్, మాదారపు వెంకటేష్, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, విద్యార్థులు

రణస్థలం: వినియోగదారులకు లభించే హక్కులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని డీఎస్‌ఓ డి.వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని జే.ఆర్.పురం హైస్కూల్లో విద్యార్థులతో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం నిత్యం కనుగోలు చేసే వస్తువుల్లో నాణ్యత లోపిస్తే ఎటువంటి చర్యలు చేపట్టవచ్చో వివరించారు. ప్యాకింగ్‌ల ద్వారా అమ్ముతున్న తినుబండరాల నాణ్యతను పరిశీలించాలని, దానిపై తయారైన తేదీతోపాటు ఎన్ని రోజుల లోగా వాడాలో అనే తేదీ కూడా ఉంటుందన్నారు. ఇలా అన్ని వస్తువులను పరిశీలించి తీసుకోవాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఎన్.హేమసుందర్, యూడీఆర్‌ఐ ఎ.రాంబాయి, ఎంఈఓ ఎ.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



పాతపట్నం: బోరుభద్రలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాతపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ అన్నారు. మండలంలోని బోరుభద్ర గ్రామంలో ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ కుటుంబంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్వేలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, కంటి తదితర ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు గుర్తించిన వ్యాధుల తీవ్రత మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపేటలో..

బూర్జ: మండలంలోని పెద్దపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బూర్జ పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ లఖినాన సరోజిని ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలోని 50 ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించి 55 మందికి వివిధ రకాల పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావ్య, ఆరోగ్య కార్యకర్త జగదీష్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

హిరమండలం: ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలుకు శ్రీకారం చుట్టిందని ఎంఎల్‌ఓ సి.హెచ్.సి.రాజా అన్నారు. మండలంలోని ఎంఎల్‌పురం, హిరమండలం సచివాలయం-2 గ్రామ సచివాలయాలలో గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ కుటుంబాన్ని సురక్షితంగా ఉంచేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఉచిత ఆరోగ్య వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి రోగులను గుర్తించాలన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామాల్లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చరిత్రాత్మకం



మోదీ చిత్రపటంతో బీజేపీ మహిళా నాయకులు, మహిళలు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో మహిళాభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ చరిత్రాత్మకమని బీజేపీ మహిళా నేతలు ఆనందం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టిన నేపథ్యంలో శ్రీకాకుళం సూర్యమహల్ జంక్షన్‌లోని స్వామి వివేకనందా విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి గంగు శ్రీదేవి, సాధు రేవతీ, నాగమణి, విజయమ్మ, నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, అట్టాడ రవి బాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం శ్రీకాకుళం పీఎన్‌కాలనీలో సాయి విద్యామందిరం స్కూల్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి అభినందన ర్యాలీ నిర్వహించారు.

కరాటే పోటీల్లో పతకాల పంట



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక మహాలక్ష్మినగర్ కాలనీలోని కెన్యూ రియో కరాటే విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటారు. విశాఖపట్నంలో తాజాగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్ నిలబెట్టుకోవడంతో పాటు పతకాలు సాధించారు. మొత్తం 27 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా కటా, కుమిటీ విభాగాల్లో 46 పతకాలు పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో 12 బంగారు, 16 రజతాలు, మరో 18 కాంస్య పతకాలు ఉన్నాయి. గెలుపొందిన క్రీడాకారులు ఏపీ కరాటే చీఫ్, సినీ నటుడు కె.సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, పతకాలు అందుకున్నారు. క్రీడాకారులతో పాటు కెన్యూరియో కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావును శ్రీచైతన్య పాఠశాల ఆర్‌ఐ శీపాన రామినాయుడు, ప్రిన్సిపాల్ రాంప్రసాద్, శ్రీనివాస్, ప్రతినిధులు, సిబ్బంది అభినందించారు.

వితరణ..

పొందూరు: మండలంలోని పిల్లలవలస గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కెనడాలో ఉన్న పూర్వవిద్యార్థి గురుగుబెల్లి సుధాకర్ కంప్యూటర్, హోమ్ థియేటర్, ప్రొజెక్టర్‌ను వితరణ చేశారు. ఈ పరికరాలను సుధాకర్ కుటుంబీకులు బుధవారం హెచ్‌ఎం సుగ్గు కాసులబాబుకు అందజేశారు. గురుగుబెల్లి నరసయ్య, శ్రీరామమూర్తి, వావిలపల్లి చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని మురపాక హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేసి బదిలీ అయిన ఎం.అరుణ, పీడీ ఎస్.సూరిబాబు, ఉపాధ్యాయులు డీవీ దుర్గాప్రసాద్, కె.ఆనందరావు, ఆఫీస్ సబార్డినేట్ కె.అప్పలరాజును బుధవారం సన్మానించారు. మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, పీఎంసీ చైర్మన్ తేనేల విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తేనేల సురేష్‌కుమార్, పెయ్యల లక్ష్మణరావు, హెచ్‌ఎం కేవీఎస్ఎస్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న వైసీబీ డైరెక్టర్ ప్రసాదరావు

లావేరు: శిక్షణను క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు సద్వినియోగం చేసుకోవాలని వైసీబీ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. బెంగుళూరుకు చెందిన ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో వైసీబీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్కూల్ రెడీనెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెజ్జిపురం గ్రామంలో వైసీబీ కార్యాలయంలో శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం, పొందూరు మండలాల్లో పనిచేస్తున్న 35 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ రిసోర్స్ విధులు, బాధ్యతలు గురించి వైసీబీ డైరెక్టర్ తెలియజేశారు. శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని దానిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీబీ కోశాధికారి జి.అప్పలనాయుడు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వై శంకరరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు ఎ.రమణమూర్తి, ఆర్.కల్పన, జి.హేమసుందర్, బి.సంతోషి, సిబ్బంది, సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశిష్ట గ్రంథం పారిజాతాపహరణం



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: విశిష్ట గ్రంథరాజం పారిజాతాపహరణమని తెలుగు పండితులు పి.వి.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఉపనిషన్మందిరం, మహతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పారిజాతాపహణంపై ప్రసంగం బుధవారం జరిగింది. కావ్యంలో ప్రతి పాత్రను మలచిన తీరు అద్భుతమని కొనియాడారు. పాత్రలన్నీ కళ్లకు కట్టినట్లు సాక్షాత్కరిస్తాయన్నారు. భార్యాభర్తల అన్యోన్యత ఈ కావ్యంలో వివరించారన్నారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, దుర్గారావు, విశ్వేశ్వరరావు, సనపల నారాయణమూర్తి, కోమలరావు, ఎం.శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి



సూచనలిస్తున్న ఎస్‌డీసీ మురళీకృష్ణ

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాల్లోనూ మౌలిక వసతులు ఉండాలని, వసతులు లేని పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వాలని ప్రజాప్రతినిధులకు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి పి.మురళీకృష్ణ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సమగ్రంగా రూపొందించడం జరిగిందన్నారు. వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు సూచించిన పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని 23 పోలింగ్ కేంద్రాలను స్థానచలనం చేశామన్నారు. ఓటర్ల చేర్పు, తొలగింపుల జాబితా స్పష్టంగా ప్రజాప్రతినిధులకు, సంబంధిత ఓటర్‌కు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం తహసీల్దార్లు సనపల కిరణ్ కుమార్, దీలీప్ చక్రవర్తి, టి.సత్యనారాయణ, పప్పల వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ నిమజ్జనం



పట్టుపురంలో విశ్వకర్మ నిమజ్జనం నిర్వహిస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామంలో విశ్వకర్మ విగ్రహ నిమజ్జనం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కాశీవిశ్వేశ్వర సంఘం అధ్వర్యంలో మూడు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వర్షాలు పడి పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరినట్లు తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. పలువురు సంఘ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా ఇదేవిధంగా పూజలు నిర్వహిస్తామని, అయితే ఈ ఏడాది ఓ ప్రత్యేకత సంతరించుకుందని తెలిపారు. ప్రతీ ఏటా సెప్టెంబర్ 17వ తేదీన విశ్వకర్మ దినోత్సవంగా ప్రకటించడమే కాకుండా.. సెలవు దినంగా ప్రకటించడంతో ఆనందంగా ఉన్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కాశీవిశ్వేశ్వర సంఘం అధ్యక్షుడు పి.కృష్ణారావు, తామాడ కామేశ్వరరావు, జి.కృష్ణారావు, తామాడ భాస్కరరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజనీకుమారి

సారవకోట:

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని బుడితి సీహెచ్‌సీ సూపరెంటెండెంట్ సుజనీకుమారి సూచించారు. బుధవారం బుడితి సీహెచ్‌సీలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గొంతు, చెవి, ముక్కు తదితర సమస్యలపై పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బుడితి సీహెచ్‌సీలో ప్రస్తుతం 9 మంది వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. వైద్యులు చైతన్య, వినోద్, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ, జాడ కార్తీక్, గేదెల క్రాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు నిర్వహించారు. ఆయుష్మాన్ భవలో భాగంగా ఆరోగ్య మేళా సేవలను రోగులకు అందజేశారు. గర్భిణి, చెవి, ముక్కు, గొంతు, చిన్న పిల్లలు, మానసిక ఆరోగ్య నిపుణులు, శస్త్ర చికిత్స నిపుణులతోనూ ప్రత్యేక సేవలను అందజేయడం జరిగింది. ఈ నెల 25, 29వ తేదీలలోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వైద్యులు అనిల్‌కుమార్, సుజాత, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో..
పొందూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు నిర్వహించారు. ఆయుష్మాన్ భవలో భాగంగా ఆరోగ్య మేళా సేవలను రోగులకు అందజేశారు. గర్భిణి, చెవి, ముక్కు, గొంతు, చిన్న పిల్లలు, మానసిక ఆరోగ్య నిపుణులు, శస్త్ర చికిత్స నిపుణులతోనూ ప్రత్యేక సేవలను అందజేయడం జరిగింది. ఈ నెల 25, 29వ తేదీలలోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వైద్యులు అనిల్‌కుమార్, సుజాత, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.